# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 98 | గురువారం 11, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## గ్లోబల్ సమ్మిట్‌పై అంత భయమెందుకు?

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది
నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల భర్తీ
ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి పెట్టుబడులు
పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

03



## గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్

కట్టుకథలు చెప్పి కోట్లు ఖర్చు చేశారు
విజన్ డాక్యుమెంట్ లో విజనే లేదు
క్యూర్, ప్యూర్, రేర్ అంటున్న రేవంత్ చోర్
సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం

03





## పల్లె పోరుకు సర్వం సిద్ధం

నేడు తొలి విడుత పోలింగ్
ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహణ
మధ్యాహ్నం 2 తర్వాత లెక్కింపు.. ఫలితాల వెల్లడి
బ్యాలెట్ బాక్సుల ద్వారానే ఎలక్షన్
37,562 పోలింగ్ కేంద్రాలు,
56 లక్షల మంది ఓటర్లు
27,41,070 మంది పురుష ఓటర్లు
మహిళలు 28,78,159 మంది
396 సర్పంచ్ లు, 9,633 వార్డులు ఏకగ్రీవం
మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు 12,960 మంది పోటీ
27,628 వార్డులకు 65,455 మంది పోటీ
పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు
నేడో, రేపో ఉప సర్పంచ్ ఎన్నిక
క్లారిటీ ఇచ్చిన ఎన్నికల కమిషన్




**హైదరాబాద్, (ప్రజాస్వరం):** పల్లె సీమల్లో గ్రామ స్వరాజ్యం దిశగా జరిగే 'పల్లె పోరు'కు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం తొలి విడుత పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ప్రశాంతమైన, సజావుగా ..మిగతా 2లో

## రాష్ట్రంలో హత్యలు మళ్లీ మొదలయ్యాయి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హత్యలు ప్రారంభమయ్యాయన్న జగదీశ్ రెడ్డి
సూర్యాపేటలో హత్యకు గురైన మల్లయ్య కుటుంబానికి పరామర్శ
మల్లయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ



02



## ఓయూ అంటేనే ఓ చైతన్యం

ఎందరో వీరులు ఈ యూనివర్సిటీ నుంచే పుట్టారు
ఓయూ అభివృద్ధికి వెయ్యి కోట్లు కేటాయించాం
అభివృద్ధిలో విద్యార్థులను భాగస్వాములను చేస్తాం
ఆధిపత్యానికి వ్యతిరేకంగా కొట్లాడిన చరిత్ర ఉస్మానియాది
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)ను సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. గుండెల నిండా అభిమానం, గౌరవంతో ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థకు వచ్చానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్ల నిధులను ప్రకటించారు. ఈ నిధులు యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్లుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడతాయని వివరించారు.

**సందర్శన నేపథ్యం సంకల్పం**

రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో ఓయూ చరిత్రను గుర్తుచేస్తూ, తెలంగాణ ఉద్యమంలో ఈ యూనివర్సిటీ పాత్రను ప్రస్తావించారు. "ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు జరిగాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగింది. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి సామాన్యులు దొరలపై పోరాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు న్యాయం ..మిగతా 2లో

## విస్తరణకు మేం వ్యతిరేకం

ఆల్ పార్టీ మీటింగ్, ప్రజల అభిప్రాయం లేకుండా డివిజన్ పెంపా?
ఇదంతా మజ్లిస్‌కు లబ్ధి చేకూర్చేందుకేనా?
గ్లోబల్ సమ్మిట్‌లో 10 డొల్ల కంపెనీలు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

02



## మీరు నాకు చెప్పొద్దు.. నా అనుభవం 30 ఏళ్లు!

లోక్‌సభలో అమిత్ షా, రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం
మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదని రాహుల్‌కు స్పష్టం చేసిన షా
ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు పోతాయనేదే విపక్షాల భయమని విమర్శ
గతంలో కాంగ్రెస్ ప్రధానులూ ఇలాంటి సవరణలు చేశారని గుర్తు చేసిన షా



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):** లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల సంస్కరణలపై జరుగుతున్న చర్చలో రాహుల్ గాంధీ అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అమిత్ షా ఘాటుగా స్పందించారు. "మీ ఆదేశాలతో పార్లమెంట్ నడవదు... సభా సమావేశాలను మీరు శాసించలేరు" అని తీవ్ర ..మిగతా 3లో

## ఆ హామీని పూర్తిగా విస్మరించారు

సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు
2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని సూటి ప్రశ్న
జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను వంచించారని ఆరోపణ
యువత ఆకాంక్షలకు ఓయూ గడ్డపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్



02



## టెన్త్ టైం టేబుల్‌ను సవరించాలి

విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
టెట్ సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం
రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షల కోసం పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం విడుదల చేసిన టైమ్ టేబుల్ పూర్తిగా అశాస్త్రీయంగా ఉన్నదని, దానిని సవరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్), ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కేవలం 7 పేపర్లు రాయడానికి ..మిగతా 2లో

## 65 నూతన ఎలక్ట్రిక్ బస్సులు

బస్సులను నిర్వహించనున్న ఈవీ ట్రాన్స్
టీజీఎస్ ఆర్టీసీ 500 బస్సుల ప్రాజెక్ట్‌లో మరో ముందడుగు
బస్సులను జెండా ఊపి ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** పర్యావరణ హిత మెట్రో ఎలక్ట్రిక్ బస్సులు 65 బుధవారం హైదరాబాద్ రోడ్లు ఎక్కాయి. ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలో నడిచే ఈ బస్సులను రాణిగంజ్ డిపో లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత రాణిగంజ్ డిపో నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి వరకు బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి ,హైదరాబాద్ మేయర్ ..మిగతా 3లో

# విస్తరణకు మేం వ్యతిరేకం

- ఆల్ పార్టీ మీటింగ్, ప్రజల అభిప్రాయం లేకుండా డివిజన్ల పెంపా?
- ఇదంతా మజ్లిస్‌కు లబ్ధి చేకూర్చేందుకేనా?
- గ్లోబల్ సమ్మిట్‌లో 10 డొల్ల కంపెనీలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, (ప్రజాస్వరం):

జీహెచ్ఎంసీ విస్తరణకు తాము వ్యతిరేకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన జీహెచ్ఎంసీ పరిధిలోని ముఖ్య నాయకులతో కీలక సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం వల్ల ప్రజలకు కలిగే నష్టాలు, నగర సమస్యలు, అలాగే జీహెచ్ఎంసీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతంరావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్ చార్జ్‌లు, తదితర నాయకులతో చర్చించారు. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, జీహెచ్ఎంసీలో 7 కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీల విలీనంపై ఆల్ పార్టీ మీటింగ్, పబ్లిక్ ఒపీనియన్ లేకుండా డివిజన్లు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన 300 డివిజన్లు పెట్టారని నిలదీశారు. మజ్లిస్‌కు లబ్ధి చేకూర్చడం కోసమే విలీనం చేశారని అనుమానం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ మొత్తాన్ని మూడు భాగాలు చేసి ఒక్క భాగాన్ని మజ్లిస్‌కు ధారాధత్తం చేసే కుట్ర జరుగుతున్నట్లుగా అనుమానం కలుగుతున్నదని పేర్కొన్నారు. క్విడ్ ప్రో కో కింద హైదరాబాద్ స్వరూపాన్ని కాంగ్రెస్ మార్చే కుట్ర చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ ప్రజలతో రాష్ట్ర ప్రభుత్వం గిల్లీ దండ ఆడుతున్నదని విమర్శించారు. ఈ అంశంపై అభ్యంతరాలు తెలిపేందుకు సమయమున్నదని, జీహెచ్ఎంసీలో విలీనమైన కొత్త ప్రాంత ప్రజలు ఈ కుట్రను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇక, గ్లోబల్ సమ్మిట్‌లో 10 వరకు డొల్ల కంపెనీలు ఉన్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. వాళ్లకు దేశమంతా అప్పులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం రిజెక్ట్ చేసిన కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కంపెనీలతో ఎంవోయూ చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన భూముల్లో కంపెనీలు ఇన్వెస్ట్ చేయకుంటే భూమి రిటర్న్ తీసుకున్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. అందుకే జాగ్రత్తగా చూసి కంపెనీల చరిత్ర బయట పెట్టాలన్నారు. కాంగ్రెస్ తీరు వల్ల హైదరాబాద్ ప్రపంచంలో పెద్ద సిటీ అవ్వడం పక్కన పెడితే దొంగ కంపెనీల సిటీగా అయ్యే ప్రమాదమున్నదని రాంచందర్ రావు మండిపడ్డారు.

# ఆ హామీని పూర్తిగా విస్మరించారు

- సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు
- 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను వంచించారని ఆరోపణ
- యువత ఆకాంక్షలకు ఓయూ గడ్డపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్



హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను మోసం చేసిందని ఆమె ఆరోపించారు.

"జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ హామీని పూర్తిగా విస్మరించారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాట ఏమైంది?" అని కవిత నిలదీశారు. ఇప్పటివరకు ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో, ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

ఉస్మానియా యూనివర్సిటీలో జరగనున్న 'రైజింగ్ తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "పోరాటాల పురిటిగడ్డ అయిన ఓయూలో అడుగుపెడుతున్న మీరు, మీ వంచనతో ఆందోళనలో ఉన్న నిరుద్యోగ బిడ్డలకు ఏం సమాధానం చెబుతారు?" అని ఆమె ప్రశ్నించారు.

"ఉత్తుత్తి మాటలు, జాబ్‌లెస్ క్యాలెండర్లకు కాలం చెల్లింది. రైజింగ్ పేరుతో అబద్ధాలు చెప్పడం కాదు, యువత ఆకాంక్షలపై ఓయూ గడ్డ మీదనే స్పష్టత ఇవ్వాలి" అని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు యువత పక్షాన పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు.

# ఓయూ అంటే ఓ చైతన్యం

మొదటిపేజీ తరువాయి

జరగలేదని గ్రహించి, స్వరాష్ట్ర ఉద్యమం పురుడు పోసుకుంది. ఈ ఉద్యమాన్ని ఓయూ విద్యార్థులు ముందుండి నడిపించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షలను బలంగా వినిపించారు" అని ఆయన అన్నారు.

ఆయన మరింత వివరిస్తూ, "పోరాడి సాధించిన తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా? లేదా? అని తెలుసుకోవాలని ఇక్కడికి వచ్చాను. గతంలో చాలామంది 'ఓయూకు వెళ్లే ధైర్యం ఎందుకు చేస్తున్నారు?' అని అడిగారు. కానీ, నాది ధైర్యం కాదు... అభిమానం. మన భవిష్యత్తు ప్రణాళికలు రాసుకునేందుకు ఇక్కడికి వచ్చాను. ఓయూను అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దాలనేది నా సంకల్పం" అని పేర్కొన్నారు. ఈ ప్రకటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**ఓయూ గొప్పతనం, ప్రముఖులు**

ప్రసంగంలో రేవంత్ రెడ్డి ఓయూ గొప్పతనాన్ని కొనియాడారు. "తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ అందించింది. బడికి వెళ్లని పేదింటి బిడ్డ అందెశ్రీ 'జయజయహే తెలంగాణ' నినాదాన్ని సృష్టించారు. సమాజంలో ఏ సమస్య వచ్చినా ఓయూ విద్యార్థులు ముందుండి కదం తొక్కారు" అని ఆయన వివరించారు.

ఆయన మరింత లోతుగా మాట్లాడుతూ, "రాష్ట్ర ఏర్పాటు తర్వాత మనం ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే కోరాం. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇస్తుంది. మీరు ప్రపంచానికే దిక్సూచిగా మారాలి" అని విద్యార్థులకు సూచించారు. రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదని చెప్పిన ఆయన, కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారని, తాను గుంటూరులో చదువుకోలేదని, గూడుపుఠాణీలు చేయలేనని వ్యంగ్యంగా అన్నారు. "గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలనుకుంటున్నారు?" అని ప్రశ్నించారు.

**విద్య ప్రాముఖ్యత మరియు ప్రభుత్వ చర్యలు**

విద్య ఆత్మగౌరవాన్ని పెంచుతుందని రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. "నాకు భాష సరిగా రాకపోవచ్చు... కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు... సాధారణంగానే ఉన్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలనుకుంటున్నా" అని అన్నారు.

ప్రభుత్వ చర్యలను వివరిస్తూ, "జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను తీర్చాం. గత పదేళ్లలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు... కానీ ఎవరికైనా ఇచ్చారా? వెనుకబాటుతనాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్ అందించేందుకు కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు.



విద్యాలయాల్లో కుల వివక్ష లేకుండా చేయాలని, యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. "చైనాకు ఇంగ్లిష్ రాదు... కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం... అది నాలెడ్జ్ కాదు" అని ఉదాహరణ ఇచ్చారు. ఓయూను రాష్ట్రానికి 'గుండెకాయ' లాంటిదిగా అభివర్ణించారు.

**నిధుల మంజూరు మరియు జీవో జారీ**

ప్రభుత్వం ఓయూకు రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. "ఈ నిధులు డబ్బుగా కాదు... భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. విద్యార్థులకు అంకితం చేస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు. ఈ నిధులతో యూనివర్సిటీలో మౌలిక సదుపాయాలు, పరిశోధనా కేంద్రాలు, విద్యా నాణ్యతను మెరుగుపరచనున్నారు. ఈ సందర్భంతో ఓయూ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రేవంత్ రెడ్డి ప్రసంగం తెలంగాణ విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టెన్త్ టైం టేబుల్‌ను సవరించాలి

మొదటిపేజీ తరువాయి

దాదాపు 35 రోజుల పాటు పరీక్షల నిర్వహించడం అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. ఇది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాలల ప్రయోజనాలు కాపాడడం కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాన్ని రుద్దినట్లుగా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ టైమ్ టేబుల్ వల్ల పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చడం కంటే మిగతా తరగతుల విద్యార్థులకు కలిగే నష్టం ఎక్కువ అని పేర్కొన్నారు.

**విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతి పత్రం**

ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇస్తే సరిపోతుందని, నాలుగు నుంచి ఆరు రోజులు ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఆసక్తి తగ్గుతుందని అన్నారు. 35 రోజుల పాటు ఉపాధ్యాయులు, పాఠశాలలు పరీక్షల నిర్వహణలో ఉంటే మిగతా తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణ ఎవరు చేపట్టాలని ప్రశ్నించారు. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టి ఆసక్తిని పెంచేలా విధానాలు రూపొందిచాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని తెలిపారు. మరోవైపు, టెన్త్ పరీక్ష షెడ్యూల్‌ను సవరించాలని విద్యాశాఖ డైరెక్టర్, పరీక్షల నియంత్రణ అధికారికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు.

**టెట్ సమస్య పరిష్కారానికి ఉమ్మడి పోరాటం**

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత నుంచి మినహాయింపు ఇవ్వాలని, అందుకు అవసరమైన చర్యలను తక్షణమే తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఉమ్మడి పోరాటం నిర్వహించాలని అఖిల భారత స్థాయిలో ఉపాధ్యాయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన 15 సంవత్సరాల తర్వాత అంతకు ముందు నియామకమైన ఉపాధ్యాయులు కూడా రెండేళ్లలో టెట్ పాస్ కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం దురదృష్టకరమని పేర్కొన్నారు. సుప్రీం తీర్పు వచ్చి మూడు నెలలు గడుస్తున్నా, దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా, కొందరు ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు.

**ఓయూకు రూ.1,000 కోట్ల కేటాయింపుపై హర్షం**

ఉస్మానియా యూనివర్సిటీకి ఎస్ఎఫ్ ఐ, విద్యార్థి సంఘాలు, అధ్యాపక సంఘాల పోరాట ఫలితంగానే రూ.1,000 కోట్ల కేటాయింపులు జరిగాయని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఉస్మానియాకు నిధులు కేటాయిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియాతో పాటు రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీల అభివృద్ధికి సైతం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని, హాస్టళ్ల మెస్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

# పల్లె పోరుకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ప్రక్రియ జరిగేలా పటిష్టమైన భద్రత, నిర్వహణ చర్యలు చేపట్టారు. బ్యాలెట్ బాక్సుల ద్వారానే ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో తొలి విడత పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి అదేరోజు ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తొలి విడతలో మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల అనంతరం పలు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇప్పటివరకు 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఆ స్థానాలు మినహాయించగా మిగిలిన 3,834 సర్పంచ్, 27,628 వార్డులకు పోలింగ్ జరగనుంది. 3,834 సర్పంచ్ స్థానాలకు 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే 27,628 వార్డులకుగాను 65,455 మంది పోటీపడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) వినియోగించడం లేదు. సాంప్రదాయ బ్యాలెట్ బాక్సుల ద్వారానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 37,562 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ తొలి దశ పోలింగ్‌లో మొత్తం 56,19,430 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 27,41,070 మంది పురుష ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 28,78,159 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళల సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం.

**5 జీపీల్లో జీరో నామినేషన్లు**

రాష్ట్రంలో ఫస్ట్ ఫేజ్ పోలింగ్ జరిగే 5 గ్రామ పంచాయతీల్లో ఒక్కటంటే ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలాగే 169 వార్డుల్లోనూ ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఒక గ్రామపంచాయతీలో ఎన్నికలు నిలిచిపోయాయి. అలాగే పది వార్డు స్థానాలకు సైతం నిలిచిపోయినట్లు అధికారులు స్పష్టంచేశారు. కాగా 369 సర్పంచ్ స్థానాలు, 9633 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**

పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, అక్కడ అదనపు బలగాలను మోహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 243 సమస్యత్మాక ప్రాంతాలను అధికారులు గుర్తించారు. సమస్యత్మాక ప్రాంతాల్లో బందోబస్తును రెండింతలు పెంచారు. ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. మహబూబాబాద్ వంటి జిల్లాల్లో అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలను, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మాజీ మావోయిస్టులు పోటీ చేస్తున్న శివంగలపల్లి వంటి ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

ఫస్ట్ ఫేజ్ లో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద 3,214 ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. కాగా ఎన్నికలకు ఎవరైనా విఘాతం కలిగించే అవకాశముందని భావించి భారత న్యాయ సంహిత ప్రకారం 31,428 మందిని బైండోవర్ చేసినట్లు స్పష్టంచేశారు. 902 లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసుల వద్ద డిపాజిట్ చేశారు. దాదాపు రూ.1,70,58,340 నగదును సీజ్ చేశారు. రూ.2,84,97,631 విలువైన మద్యం సీజ్ చేశారు. అలాగే రూ.2,22,91,714 విలువైన డ్రగ్స్ ను సీజ్ చేసినట్లు అధికారులు స్పష్టంచేశారు. తనిఖీల్లో భాగంగా రశీదులు చూపని రూ.12,15,500 విలువైన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**సీఎంపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు : రాణి కుముదిని**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు అందినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రాణి కుముదిని తెలిపారు. కాగా దీనిని ఎన్నికల ప్రవర్తన నియమావళికి పంపినట్లు తెలిపారు. వారందించే నివేదిక తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని ఆమె స్పష్టంచేశారు. రెండు సంవత్సరాల ప్రజా పాలన ఉత్సవాల నిర్వహణకు తమను అనుమతి అడిగారని, తాము కూడా అనుమతి ఇచ్చినట్లు ఆమె చెప్పారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని వివరించారు. కాగా ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం సాయంత్రం లేదా శుక్రవారం ఉంటుందని స్పష్టంచేశారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని ఆమె చెప్పారు. సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయిందని రాణి కుముదిన స్పష్టంచేశారు.



# రాష్ట్రంలో హత్యలు మళ్లీ మొదలయ్యాయి

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హత్యలు ప్రారంభమయ్యాయన్న జగదీశ్ రెడ్డి
- సూర్యాపేటలో హత్యకు గురైన మల్లయ్య కుటుంబానికి పరామర్శ
- మల్లయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ

హైదరాబాద్, (ప్రజాస్వరం):

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మళ్లీ హత్యల సంస్కృతి మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆయన మండిపడ్డారు. సూర్యాపేటలో హత్యకు గురైన మల్లయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆరు నెలల క్రితం కూడా కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో ఓ హత్య జరిగిందని, పోలీసుల నిర్లక్ష్యంపై తాను అప్పుడే హెచ్చరించానని జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. అయినా వారి వైఖరిలో మార్పు రాకపోవడం వల్లే ఇప్పుడు మరో హత్య జరిగిందని విమర్శించారు. గతంలో ఈ గడ్డపై కాంగ్రెస్ నేతలు హత్యలు చేసేవారని, తాము పదేళ్ల పాలనలో ఆ సంస్కృతిని రూపుమాపితే, కాంగ్రెస్ మళ్లీ దానిని తిరిగి తీసుకొచ్చిందని ఆరోపించారు. హత్యకు గురైన మల్లయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలా అండగా



ఉంటుందని భరోసా ఇచ్చారు. మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు కేటీఆర్ రావాలనుకున్నారని, అయితే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉద్రిక్తతలు పెరగకూడదనే ఉద్దేశంతో ఆయన పర్యటనను వాయిదా వేసుకోవాలని తామే కోరినట్లు తెలిపారు.

# మీరు నాకు చెప్పొద్దు.. నా అనుభవం 30 ఏళ్లు!

**మొదటిపేజీ తరువాయి**

ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ కల్పించుకుని, "ముందు నిన్న నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. దీనిపై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. తనకు అసెంబ్లీ, పార్లమెంటులో 30 ఏళ్ల అనుభవం ఉందని, తాను ఎప్పుడు మాట్లాడాలో మీరు నిర్దేశించలేరని అన్నారు.
ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR)పై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను అమిత్ షా తిప్పికొట్టారు. విపక్షాలు 'ఓట్ల దొంగతనం' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల జాబితా నుంచి మరణించిన వారిని, విదేశీ పౌరులను తొలగించడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. "చట్టవిరుద్ధ వలసదారులు ఎన్నికల్లో పాల్గొనాలా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. 1952 నుంచి 2004 వరకు అనేకసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఓటర్ల జాబితా సవరణలు జరిగాయని గుర్తుచేశారు. "జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ఎవరూ దీనిని వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడెందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నారు?" అని నిలదీశారు. నాలుగు నెలలుగా ఏకపక్ష అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తమకు మద్దతిచ్చే చట్టవిరుద్ధ వలసదారుల ఓట్లు తొలగిపోతాయనే భయంతోనే విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని అమిత్ షా విమర్శించారు.



# 65 నూతన ఎలక్ట్రిక్ బస్సులు





**మొదటిపేజీ తరువాయి**

గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఈవీ ట్రాన్స్ సీఈఓ సందీప్ రైజాడ , సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి, నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ పీవీ మునిశేఖర్, సిహెచ్ వెంకన్న, ఎం రాజశేఖర్, కార్పొరేటర్ సుచిత్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్ఆర్టీసీ ) భాగస్వామ్యంతో 65 కొత్త 12మీటర్ల లోఫ్లోర్ ఎలక్ట్రిక్ సిటీ బస్సులను ఈవీ ట్రాన్స్ ప్రారంభించింది. పర్యావరణ హిత , ఆధునిక, విశ్వసనీయమైన ప్రజా రవాణా సేవలను హైదరాబాద్ నగరానికి అందించాలనే లక్ష్యంతో చేపట్టిన టీజీఎస్ఆర్టీసీ 500 లోఫ్లోర్ సిటీ ఈబస్ ప్రాజెక్ట్‌లో ఈ బస్సులను ప్రవేశ పెట్టడం ఓ ముఖ్యమైన దశగా నిలిచింది.
ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 450 నాన్‌ఏసీ , 50 ఏసీ లోఫ్లోర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటివరకు 325 బస్సులను ఈవీ ట్రాన్స్ సరఫరా చేసింది. మిగిలిన 175 బస్సులను 2026 జనవరి నాటికి టీజీఎస్ఆర్టీసీకి ఈవీ ట్రాన్స్ అందించనుంది. ఈ బస్సుల సరఫరాతో హైదరాబాద్ నగరంలో సుస్థిర రవాణా మౌలిక వసతులు మరింతగా బలోపేతం కానున్నాయి. 36 సీట్ల సామర్థ్యంతో కొత్తగా ప్రవేశపెట్టిన 12మీటర్ల లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను లిథియమ్‌అయాన్ బ్యాటరీలు, రీజెనరేటివ్ బ్రేకింగ్, రియల్ టైమ్ ట్రాకింగ్‌తో కూడిన ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్, ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టమ్, అధునాతన మోటార్-కంట్రోలర్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించారు. ఈ బస్సుల్లో ఆటోమేటెడ్ అనౌన్స్‌మెంట్స్, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు, వృద్ధులు , దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయి. ఈ బస్సులు సికింద్రాబాద్, కొండాపూర్, ఇస్నాపూర్, బోరబండ, రామాయంపేట్, గచ్చిబౌలి, మియాపూర్ వంటి ప్రధాన రూట్లలో నడవనున్నాయి. దీంతో రోజువారీ ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ కొత్త బస్సుల వల్ల శబ్ధ, వాయు కాలుష్యం, ఆపరేషనల్ ఖర్చులు తగ్గడం తో పాటు హైడెన్సిటీ రూట్లపై ప్రయాణించే ప్రజలు మరింత సుఖవంతమైన, పర్యావరణ హితం ప్రయాణ అనుభవం పొందనున్నారు.
రాణిగంజ్ డిపో నుంచి నడపనున్న వంద ఈ బస్సుల్లో నేడు ప్రారంభించిన 65 బస్సులు కూడా ఉన్నాయి. నగరంలోని కంటోన్మెంట్, మియాపూర్ , హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హయత్‌నగర్, రాణిగంజ్ డిపో సహా మొత్తం అయిదు ముఖ్య డిపోల నుంచి ఎలక్ట్రిక్ బస్సులను ఆర్ టి సి నడుపుతోంది. ఈ ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభంతో టీజీఎస్ఆర్టీసీ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా హైదరాబాద్ నగరానికి ప్రపంచ స్థాయి, పర్యావరణహిత, ప్రయాణీకులకు అనుకూలమైన ప్రజా రవాణా సేవలను అందించాలనే తమ లక్ష్యాన్ని మరోసారి చాటుకున్నాయి.
ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున ఆర్టీసీ రాణిగంజ్ డిపో నుండి 65 బస్సులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ,కరీంనగర్ , నిజామాబాద్ , నల్గొండ ,సూర్యాపేట మార్గాల్లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. ఢిల్లీ లో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు జీవించలేని పరిస్థితి, ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ , స్క్రాప్ పాలసీ తీసుకొచ్చింది. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వివిధ పుణ్యక్షేత్రాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతాము. ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం వల్ల నగరంలో ప్రయాణికులకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. నగర శివారు ప్రాంతాలకు బస్సులు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఎక్కడెక్కడ బస్సులు అవసరమో సర్వే చేసి ముఖ్యమంత్రి సూచనలతో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. ఇప్పటి నుంచి ఆ కాలనీ లకు బస్సులు నడుస్తాయి అన్నారు. ఆర్టీసీ ఎండీ వై . నాగిరెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే రెండు సంవత్సరాల్లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రతి బస్ ఒక రోజు ఒక టన్ కార్బన్ డై ఆక్సైడ్ ను తగ్గిస్తుంది అన్నారు. ఈవీ ట్రాన్స్ సీఈఓ సందీప్ రైజాదా మాట్లాడుతూ "ఈరోజు ప్రారంభించిన ఈ బస్సులతో దేశవ్యాప్తంగా మా బస్సులు నడిచే డిపోల సంఖ్య 69కి చేరింది. తెలంగాణలో రాణిగంజ్ డిపో ఐదోది. రాష్ట్రంలో మొత్తం ఆరు డిపోల మా విస్తరణ ప్రణాళికలో ఇది కీలకమైన ముందడుగు. ప్రస్తుతం దేశంలోని 10 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 3,100కుపైగా బస్సులను విజయవంతంగా నడుపుతున్నాం. నేడు మరో 65 ఎలక్ట్రిక్ బస్సులను మా ఫ్లీట్‌లో చేర్చడం గర్వంగా ఉంది. మిగిలిన బస్సులను 2026 జనవరి నాటికి అందజేస్తాము "అన్నారు.

# గ్లోబల్‌సమ్మిట్‌పై అంత భయమెందుకు?

- **బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది**
- **నెలాఖరులోగా కార్పొరేషన్ ఛైర్మన్ల పదవుల భర్తీ**
- **ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి పెట్టుబడులు**
- **పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**


తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, బుధవారం మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎల్పీ కార్యాలయంలో జరిగిన ఈ చిట్‌చాట్‌లో, ఇటీవల ముగిసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025ను గ్రాండ్ సక్సెస్‌గా అభివర్ణించారు. ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి దేశవిదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి మరియు విజన్‌కు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన ఈ సమ్మిట్, తెలంగాణ భవిష్యత్తుకు సరికొత్త దశను తెరిచిందని, అన్ని రంగాల్లో హబ్‌గా మారుతుందని చెప్పారు. ఈ సమ్మిట్ విజయం చూసి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత హరీశ్ రావుకు గుబులు పట్టుకుందని, ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదని విమర్శించారు.
సమ్మిట్‌లో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఒప్పందాలు (MoUలు) కుదుర్చుకున్నాయని మహేశ్ గౌడ్ తెలిపారు. కంపెనీల ప్రొఫైల్‌లను పూర్తిగా పరిశీలించకుండా ఎలాంటి ఒప్పందాలు జరగవని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, ఇది చారిత్రాత్మకమైన ప్రాజెక్ట్ అని అన్నారు. ఈ సమ్మిట్‌కు కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు విషెస్ తెలిపారని పేర్కొన్నారు. మెట్రో ఫేజ్ 2తో పాటు మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులు కూడా త్వరలో చేపట్టనున్నట్టు వెల్లడించారు.
బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పోలిస్తే, తమ రెండేళ్ల పాలనలో అభివృద్ధి మరియు సంక్షేమం నాలుగింతలు జరుగుతోందని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, పదేళ్లలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయని హరీశ్ రావును ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలన మరియు తమ రెండేళ్ల పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. అలాగే, ఉద్యోగులపై హరీశ్ రావు స్పష్టమైన నిర్ణయం వెల్లడించాలని డిమాండ్ చేశారు.
కార్పొరేషన్ ఛైర్మన్లు మరియు బోర్డు పదవులను నెలాఖరులోగా భర్తీ చేస్తామని మహేశ్ గౌడ్ హామీ ఇచ్చారు. సర్పంచ్ ఎన్నికలు ముగియగానే నామినేటెడ్ పోస్టులపై దృష్టి సారిస్తామని, నూతన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిజామాబాద్ ఎమ్మెల్యే పదవికి పోటీ చేయడం హైకమాండ్ నిర్ణయమని, ప్రస్తుత పీసీసీ పదవిలో సంతృప్తిగా ఉన్నానని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో పార్టీ కోసం స్థలం కేటాయిస్తామని ప్రకటించారు.
ఇతర విషయాలపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేత కవిత వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. లావాదేవీల్లో తేడాల వల్లే కవిత విమర్శలు చేస్తున్నారని, ఆమె కారణంగా బీఆర్ఎస్ నేతల లూటీలు బయటపడుతున్నాయని ఆరోపించారు. కవిత లూటీ వ్యాఖ్యలపై సీఎం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం సాధారణ విషయం కాదని, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా సాగుతున్నాయని చెప్పారు. వందేమాతరం విషయంలో ప్రధాని మోదీ చవకబారు మాటలు మాట్లాడుతున్నారని, ప్రియాంక గాంధీ చరిత్రను గుర్తు చేశారని అన్నారు. EVMలపై కూడా విమర్శలు చేశారు - కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెట్టినా, బీజేపీ హయాంలో ట్యాంపరింగ్ జరుగుతోందని ఆరోపించారు. నెహ్రూ విజన్ వల్లే దేశం ఈ స్థితిలో ఉందని పేర్కొన్నారు. మొత్తంగా, మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. గ్లోబల్ సమ్మిట్ విజయం మరియు పాలనా పోలికలపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

# గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాఫ్

- **కట్టుకథలు చెప్పి కోట్లు ఖర్చు చేశారు**
- **విజన్ డాక్యుమెంట్ లో విజనే లేదు**
- **క్యూర్, ప్యూర్, రేర్ అంటున్న రేవంత్ చోర్**
- **సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పెట్టుబడుల కట్టుకథలు చెప్పి, కోట్లు ఖర్చు చేసి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ చేశారంటూ రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదని, దాన్ని చేరుకునే మిషన్ లేదు, విజన్ డాక్యుమెంట్ కాదు, 'విజన్ లెస్' డాక్యుమెంట్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్ అంటూ రేవంత్ రెడ్డి తెలంగాణను కొల్లగొడుతున్న రేవంత్ చోర్ అంటూ ఫైర్ అయ్యారు. గ్లోబల్ సమ్మిట్ లో ఎంఓయూల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్పాప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవని హరీశ్ రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి నువ్వు తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు గ్రౌండ్ అయ్యాయి? ఎంత మంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి? దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ సవాల్ విసిరారు. కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి గ్లోబల్ సమ్మిట్ వేదికగా టోనీ బ్లెయిర్, సుబ్బారావు ఇచ్చిన కితాబు రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి నిర్వహించింది గ్లోబల్ సమ్మిట్ లాగా లేదని, భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో లాగా ఉందన్నారు. ఫ్యూచర్ సిటీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకున్నందని వ్యాఖ్యానించారు. అందాల పోటీల్లాగే, ఏఐ సమ్మిట్ లాగే గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అయ్యిందని విమర్శించారు. విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్ లో కమిట్మెంట్ లేదన్నారు. అక్షరాలు, అంకెలు, రంగు రంగుల పేజీలతో అర్థం లేకుండా అల్లిన అబద్ధాలు, అర్థ సత్యాల 'విజన్ లెస్' డాక్యుమెంట్ గా హరీశ్ అభివర్ణించారు. రెండేళ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికి రేవంత్ రెడ్డి చేసిన పీఆర్ స్టంటే గ్లోబల్ సమ్మిట్ అన్నారు. గ్లోబల్ సమ్మిట్ అని మూడు నెలల నుంచి ఊదరగొట్టారని, 18 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తారన్నారు, మంత్రులు పోయి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించినా, కనీసం ఒక్క ముఖ్యమంత్రి రాలేదని, 5వేల మంది విదేశీ రిప్రెజంటేటివ్స్ రాలేదని, ఒక్క మీ పార్టనర్ డీకే శివకుమార్ తప్పా అంటూ మాజీ మంత్రి హరీశ్ వ్యాఖ్యానించారు. చివరకు ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ ఎంపీలు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. గ్లోబల్ సమ్మిట్ లో గ్లోబల్ రిప్రెజెంటేటివ్స్ కరువయ్యారని విమర్శించారు.





## శ్రీ రామ శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో
# పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**విశాఖపట్నం, డిసెంబర్ 10(ప్రజాస్వరం):**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, హౌర జిల్లా, షాలిమర్ రైల్వే స్టేషన్, ప్రక్కన సుమారుగా 105 ఇయర్స్, వేలసియున్న, శ్రీ రామ శ్రీ వెంకటేశ్వర దేవస్థానం, నందు వింటర్ డ్రైవ్ కారిక్రమం పేద & వృద్ధులకు దుప్పట్లు పంపిణి , చేయబడును. తేదీ 28122025 మధ్యాహ్నం 12.30నిమషం నుండి, ప్రారంభించబడును. కావున ఆంధ్రా మాహిల సంఘం, సభ్యులు, ఆంధ్ర సంఘ సభ్యులు, దేవస్థాన ట్రస్ట్ ఈ బోర్డు సభ్యులు. వైస్ చైర్మన్. బి.తారకేశ్వర్ రావు , కోశాధికారి. కే. తారకేశ్వర్రావు. , ఆస్తానా పురోహితులు, జగదీష్ శాస్త్రి . తెలియపరచినారు. షాలిమర్, నార్త్ ఇండియన్స్ మరియు, సౌత్ ఇండియన్స్ షాలిమర్ పురాజనులు, తెలుగువారు,ఇతరేతారా, సంఘాలు వాళ్ళు సకాలంలో విచ్చేసి, కార్యక్రమంను జైప్రదం చేయగలరని ఆశిస్తూయున్నాము.





# బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

**వనపర్తి,డిసెంబర్ 10 (ప్రజాస్వరం):**

స్థానిక సంస్థల ఎన్నికల వేళ గ్రామాల్లో పలువురు యువకులు పార్టీలు మారుతున్నారు. బుధవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో వనపర్తి మండలంలోని అంజనగిరి, చందాపూర్, నాచహతండాకు చెందిన పలువురు యువకులు, వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లోకి చేరారు. అంజనగిరి గ్రామానికి చెందిన పి.శ్రీశైలం, బి.రమేష్, బి.శేషకిరణ్, పి.కిషోర్, పి.శేఖర్, పి.బాలయ్య, బి.నాగరాజు, బి.అంజి, పి.బీసయ్య, జానయ్య, కె.రవి, డాక్టర్ శివ, యాదగిరి, కె.భాను 15మంది పార్టీ కండువాలు కప్పుకొని బీఆర్ఎస్‌లో సభ్యత్వం పొందారు.
చందాపూర్ గ్రామానికి చెందిన కాటమోని శరత్, బర్ల శరత్, నాచనహ తండాకు చెందిన కిషన్, రాములు, భాష, సుజాత, గోపాల్ బీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికిన నిరంజన్ రెడ్డి, ప్రజాసేవ కోసం బీఆర్ఎస్ వేదికగా పనిచేయాలని వారికి సూచించారు.





# ఎన్నికల నియమావళి పాటించాలి

**మాసాయిపేట డిసెంబర్ 11(ప్రజాస్వరం)**

మండలంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమాలు తప్పక పాటించాలని ఎంపీడీవో విజ్ఞేశ్వర, తహసిల్దార్ జ్ఞాన జ్యోతి పేర్కొన్నారు. మాసాయిపేటలో సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. నియమావళి, నిబంధన మేరకు మాత్రమే ఖర్చు చేయాలని, ఆ ఖర్చులను తప్పనిసరిగా నమోదు చేసి రిపోర్టులను అందజేయాలని అధికారులు సూచించారు.




# డీలిమిటేషన్ పై అభ్యంతరాలు ఉంటే తెలపండి

**జవహర్ నగర్, డిసెంబర్ 10, ప్రజాస్వరం:**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసిలో విలీనమైంది. జిహెచ్ఎంసి అధికారులు వార్డుల సంఖ్యను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు ఇందులో భాగంగా జవహర్ నగర్ సర్కిల్ కార్యాలయంలో వార్డు డి లిమిటేషన్ ప్రచురించారు. ఇట్టి డి లిమిటేషన్ పైన ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో 10.12.2025 నుండి 16.12.2025 వరకు ఉదయం 10.30 నిముషాల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు కార్యలయం సమర్పించాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత తెలిపారు.




# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జవహర్ నగర్,డిసెంబర్ 10, ప్రజాస్వరం:**

క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పర్వదినం క్రిస్మస్ అని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జెసీ డబ్ల్యూపీఏ కమిటీ వారి ఆధ్వర్యంలో జరిగిన గ్రాండ్ క్రిస్మస్ సెలెబ్రేషన్స్ కార్యక్రమం లో పాల్గొని క్రైస్తవ సోదరాసోదరిమనులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకలు నెలరోజుల పాటు ఘనంగా నిర్వహించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్, పల్లపు రవి, జవహర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ ,నాయకులు శ్రీనివాస్ రెడ్డి,బండ కింది ప్రసాద్ గౌడ్,రెడ్డిశెట్టి మహేష్, శ్రీకాంత్ రెడ్డి,బండి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# సినీ ఆర్టిస్ట్ అనసూయ సందడి

- **ఘనంగా కిసాన్ షాపింగ్ మాల్ ప్రారంభం....**
- **హాజరైన మెదక్ ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ లు**

**మెదక్ డిసెంబర్ 10 (ప్రజా స్వరం)**


మెదక్ జిల్లా కేంద్రం లో నూతనంగా ప్రారంభించిన కిసాన్ షాపింగ్ మాల్ లో సినీ నటి అనసూయ సందడి చేశారు. మెదక్ పోస్టాఫీసు వద్ద నూతన షాపింగ్ మాల్ ను బుధవారం గ్రాండ్ గా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సినీతార అనసూయ తో పాటు మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతరావు హాజరయ్యారు. సినీ తార అనసూయ షాపింగ్ మాల్ కు రాగానే పట్టణానికి చెందిన వారితో పాటు చుట్టూ పక్కల గ్రామాల నుంచి భారీగా జనం వచ్చారు. మెదక్ ప్రజల ఆదరణ పై అనసూయ సంతోషం వ్యక్తం చేశారు. వారితో మాట్లాడుతూ సినిమా పాటల పై డాన్స్ చేసి అలరించారు. ఆమె డాన్స్ చేయడం తో జనం పెద్ద ఎత్తిన ఈలలు వేస్తూ నినాదాలు చేశారు. కొత్త షాపింగ్ మాల్ మూలంగా మోడ్రన్ దుస్తులు పట్టణ ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అన్నారు.












# పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- **నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
- **పెట్రోల్ బంక్ సదుపాయాలు తప్పనిసరి**
- **జిల్లా పౌరసరఫరాల అధికారి పి నిత్యానందం**

**మెదక్ డిసెంబర్ 10 (ప్రజా స్వరం)**

ప్రజలకు పెట్రోల్ బంకుల్లో మౌలిక వసతులు కల్పించాలని పౌరసరఫరాల అధికారి పీ నిత్యానందం బంకు నిర్వాహకులకు సూచించారు. బుధవారం మెదక్ పట్టణంలోని శ్రీనివాస పెట్రోల్ బంక్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఇంధన కొలతలు, నాణ్యత, ధరల ప్రదర్శన, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు కల్పించాల్సిన కనీస మౌలిక వసతులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే బంకులపై ఎటువంటి కనికరం చూపబోమని స్పష్టం చేశారు. తనిఖీలో ఇంధన కొలతల్లో తేడాలు, ఫిల్టర్ పేపర్ టెస్ట్‌లో అనుమానాస్పద ఫలితాలు,తాగునీరు-టాయిలెట్స్-ఫస్ట్ ఎయిడ్, టైర్లకు ఉచిత గాలి వంటి సదుపాయాల లేమి వంటి పలు లోపాలు బయటపడ్డాయనీ, చట్టప్రకారం పెట్రోల్ బంకుల్లో ఈ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసిన అధికారి, వినియోగదారులను మోసం చేసే విధంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరపరాల అధికారి నిత్యానందం మాట్లాడుతూ "ఇంధనాన్ని ఖచ్చితమైన కొలతలతో, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా విక్రయించడం బంక్ నిర్వాహకుల చట్టబద్ధ బాధ్యత అని అన్నారు. వినియోగదారుల హక్కులను ఉల్లంఘించే ఏ అక్రమానికీ ప్రభుత్వం సహనం వహించదు" అని హెచ్చరించారు. బంక్ పై ప్రాథమిక కేసు నమోదు చేసి, సంబంధిత చట్టాల కింద వివరణ కోరినట్లు, అవసరమైతే బంక్‌ను సీజ్ చేయడం సహా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వాహనదారులకు ఇంధన నాణ్యత, కొలతపై సంబంధించిన అనుమానాలు ఉన్నప్పుడు బంకులో ఉండే కొలత-క్వాలిటీ చెక్ సామగ్రి చూపించాలని డిమాండ్ చేయొచ్చని, అలాంటి సహకారం అందించనపక్షంలో వెంటనే పౌరసరఫరాల/లీగల్ మెట్రాలజీ శాఖకు ఫిర్యాదు చేయాలని అధికారి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే బంకులపై ఎటువంటి కనికరం చూపబోమని స్పష్టం చేశారు.







# ఇప్సాకాన్–2025లో పౌల్ట్రీ రంగ అభివృద్ధికి తెలంగాణ రైజింగ్ దృక్పథం కీలకం: ఐపెమా

హైదరాబాద్, ప్రజాస్వరం:

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ దృక్పథం పౌల్ట్రీరంగ భవిష్యత్తుకు బలమైన దిక్సూచి అవుతుందని ఇపెమా-పౌల్ట్రీ ఇండియా స్పష్టం చేసింది. ఆవిష్కరణలు, సాంకేతికత, పరిశోధన ఆధారంగా రాష్ట్రం అమలు చేస్తున్న విధానాలు పౌల్ట్రీ రంగ రూపురేఖలను మలుస్తున్నాయని పేర్కొంది. హైదరాబాద్‌లోని పీజేటీఎస్ఏయూలో నిర్వహించిన ఇండియన్ పౌల్ట్రీ సైన్స్ అసోసియేషన్ 40వ వార్షిక సదస్సు, జాతీయ సింపోజియం ఇప్సాకాన్-2025లో ఐపమ ఈ అభిప్రాయాలను వెల్లడించింది. సాంకేతికత, వ్యాపారోన్నతి, పరిశోధన ఆధారిత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో తెలంగాణ జాతీయస్థాయిలో అగ్రశ్రేణి పౌల్ట్రీ కేంద్రంగా ఎదుగుతోందని ఇపెమా అభిప్రాయపడింది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 400 మందికి పైగా శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, పరిశ్రమ ప్రతినిధులు, విద్యార్థులు హాజరయ్యారు. ఐకార్-డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్, ఇండియన్ పౌల్ట్రీ సైన్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. 'ఫ్లాక్ టు ద ఫ్యూచర్: వికసిత్ భారత్‌లో ప్రోటీన్ భద్రత కోసం పౌల్ట్రీ ఉత్పత్తిలో సాంకేతికత, ఆవిష్కరణలు, ఆంత్రప్రెన్యూర్‌షిప్, సుస్థిరత' అనే అంశంతో సదస్సు కొనసాగింది. కేవీఏఎఫ్ఎస్‌యూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.సి. వీరన్న, ఐఏఎస్ అధికారి డా. కె. ఇలంబరితి తెలంగాణ పౌల్ట్రీ ఉత్పత్తి వేగంగా పెరుగుతున్న తీరుపై ప్రశంసలు కురిపించారు. జాతీయ ప్రోటీన్ భద్రతకు రాష్ట్రం ఇస్తున్న తోడ్పాటును వారు ప్రధానంగా ప్రస్తావించారు. ప్రారంభ సమావేశంలో ఇపెమా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ ప్రసంగించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించిన అభివృద్ధి తత్వాన్ని పౌల్ట్రీ రంగం అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఆవిష్కరణలు, శాస్త్రీయ అనుసంధానం, విద్యా సంస్థలు-పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యాలను పెంపొందిస్తేనే పౌల్ట్రీ రంగం ముందుకు సాగుతుందని ఆయన చెప్పారు. 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2025 విజయం, ఐపెమా చేపడుతున్న సాంకేతిక సదస్సులు, వైస్ ఛాన్సలర్ల సమావేశాలు, యువత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు శాస్త్ర ఆధారిత వృద్ధి కీలకంగా ఉంటుందని స్పష్టం చేశారు. 2026 నవంబర్ 25-27 తేదీల్లో నిర్వహించనున్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోకు ప్రపంచవ్యాప్తంగా పౌల్ట్రీ నిపుణులు హాజరుకావాలని ఉదయ్ సింగ్ బయాస్ ఆహ్వానించారు. నవంబర్ 24న పౌల్ట్రీ నాలెడ్జ్ డే నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కార్యాచరణాత్మక మద్దతు, ఈ రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణలు తెలంగాణ పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. ఈ రంగం పోషకాహార భద్రతను పెంచుతూ గ్రామీణుల జీవనోపాధికి దన్నుగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇప్సాకాన్-2025 సందర్భంగా పౌల్ట్రీ శాస్త్ర రంగంలో విశిష్ట సేవలకు గౌరవం దక్కింది. ఐకార్-డీపీఆర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వి. అయ్యగారికి లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును అందించారు. పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐపీఎస్ఏ ఫెలోస్ పరిశోధన రంగానికి చేసిన సేవలకుగాను సత్కారాలు అందుకున్నారు. పౌల్ట్రీ రంగం జాతీయ స్థాయిలో దీర్ఘకాలిక వృద్ధి సాధించాలంటే పరిశోధనలకు నిరంతర మద్దతు, ఆధునిక సాంకేతికత విస్తృత వినియోగం, విద్యా సంస్థలు-పరిశ్రమల సమన్వయం మరింత బలోపేతం కావాలని ఇపెమా స్పష్టం చేసింది. ఈ అంశాలు భారతదేశ పౌల్ట్రీ విలువ గొలుసును కొత్త ఎత్తులకు తీసుకెళ్తాయని సంస్థ అభిప్రాయపడింది.



# కేంద్ర ప్రభుత్వం ఎన్కౌంటర్ల హత్యలు, ఆదివాసీల హక్కుల ఉల్లంఘనలు వెంటనే ఆపాలి

- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

జవహర్ నగర్, డిసెంబర్ 10, ప్రజాస్వరం:

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జవహర్ నగర్లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూలను... మావోయిస్టు ఉద్యమకారులను కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు భూటకపు ఎన్కౌంటర్ల హత్యలకు, ఆదివాసి ప్రజల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడడం అమానుషం, అప్రజాస్వామికం అని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తీవ్రంగా అన్నారు.ఇంత ఆదివాసి ప్రజల 1996 పేసాచట్టం, 2006 అటవీ హక్కుల చట్టాలను అమలు చేయాలని, అదేవిధంగా ఆపరేషన్ కగార్ పేరుతో జరిగిన




ప్రభుత్వ హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చైతన్య మహిళా సంఘం ఇ.జయ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ ప్రజాసంఘాలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాలు తమ ప్రజల హక్కులను బాధ్యతగా గుర్తించి, వాటి సంక్షరణకు పాటుపడాలని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి సూచిస్తూనే ఉంటుదని, కానీ 78 సంవత్సరాల స్వతంత్ర దేశంగా చెప్పుకొంటున్న భారత్ లోని దళారీ దోపిడి పాలకులు జీవించే హక్కుతోపాటు మత విశ్వాసాలను, సమన్యాయ పౌర ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. మనిషిని మనిషిగా గౌరవించలేని విధానాలతో మానవహక్కులను మంట గలుపుతున్నారని మండిపడ్డారు. దేశ సంపదలను, వనరులను బడా కార్పొరేట్ సామ్రాజ్యవాదుల సంస్థలకు దోచిపెట్టే కుట్రలో బాగంగానే ఆదివాసీలను బలవంతంగా అడవి నుండి వెళ్ళగొట్టే చర్యలు బీజేపీ నరేంద్రమోదీ, అమిత్ షాల ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ (పిఓడబ్ల్యూ), షేక్ షావలి (ఐ.ఎఫ్.టి.యు), గడ్డం సదానందం (సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్), కుమార్ (ఏ.ఆర్.కె.ఎస్.ఎస్), ముత్తన్న (టిపిఎఫ్), మల్లేష్ (ఏ.ఐ.ఎఫ్.టి.యు), రవి (పిడిఎం), రాము(విరసం), మమత (అంబేద్కర్ సంఘం), విజయ్ (న్యూ డెమోక్రసీ), రాజనర్సింహ (పికెఎం), భవానీ (ఏబిఎంఎస్), జీ.గోపాల్ (తెలంగాణ రైతు సమితి) ముస్లిం కమిటీ ఎం.డి.పాషామియా, కేహెచ్పీఎస్ జంబుక తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళామార్గం ప్రచురించిన 'మహిళ లేని చరిత్ర లేదు' అనే పుస్తకాన్ని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ చేతుల మీదుగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సభలో ఆవిష్కరించారు.

# కలహాల కాపురం కాంగ్రెస్ ను ఎం చేస్తుందో

ప్రజాస్వరం, హైదరాబాద్ :

కాంగ్రెస్‌లో కలహాలు కామన్. ఓ నేత అంటే మరో లీడర్‌కు పడదు. ఇంకో నాయకుడి ఎదుగుదలను మరొక నేత డైజెస్ట్ చేసుకోలేరు. ఇక పవర్‌లోకి వచ్చాక ఈ గొడవ ఇంకా ఎక్కువైంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల వేళ.. ఇంటి పోరు హస్తం పార్టీకి హెడెక్‌గా మారిందట. మరీ ముఖ్యంగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న నల్గొండ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల ఆధిపత్య పోరు.. సర్పంచ్ ఎన్నికల్లో పోటీనే మార్చేసిందట. ఏ ఊరికి వెళ్లినా కనీసం ఇద్దరు నేతలు కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ ఉండటంతో.. ఎక్కడ తమ పుట్టి మునుగుతుందేమోనని టెన్షన్ పడుతున్నారట హస్తం పార్టీ పెద్దలు.అధికార హస్తం పార్టీకి నల్గొండ జిల్లా కంచుకోట. 12 అసెంబ్లీ సీట్లు ఉంటే ఒక్క సూర్యాపేటలో మినహా మిగతా 11 సీట్లను తన ఖాతాలో వేసుకుంది కాంగ్రెస్ పార్టీ. జిల్లాలో కీలక పదవులన్నీ కాంగ్రెస్ నేతల చేతుల్లోనే ఉన్నాయి. చాలా ముఖ్యమైన పంచాయతీ ఎన్నికల్లోనే హస్తం పార్టీకి అసలు సమస్య వచ్చి పడిరదట. ఇన్నాళ్లుగా లీడర్ల మధ్య నడిచిన కోల్డ్ వార్ కాస్త.. వర్గపోరుగా మారి..రచ్చకెక్కి ఇంటిపోరును రోడ్డున పడేస్తుందట. ఇప్పటికే పాత, కొత్తగా విడిపోయిన అధికార పార్టీ నేతలు పార్టీలో కుంపటి పెట్టారట. జరుగుతున్న పరిణామాలు తెలుస్తున్నా..నోరెత్తలేని పరిస్థితుల్లో ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారని ఆ పార్టీ సీనియర్ లీడర్లే చెబుతున్నారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో ఇటువంటి ఇంటి పోరు ఎక్కువగా ఉందని అంటున్నారు హస్తం నేతలు. ఆధిపత్య పోరుతో పల్లె పోరు అధికార హస్తం పార్టీకి చెమటలు పట్టిస్తోందట. ఉమ్మడి జిల్లాలో దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే దాదాపు అన్ని చోట్ల పోటీ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగానే ఉంటోందట. హస్తం పార్టీ లీడర్లే వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారట. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఒరిజినల్ కాంగ్రెస్..వలస కాంగ్రెస్ లీడర్ల మధ్య గట్టి ఫైట్ నడుస్తోందట. సీనియర్ కాంగ్రెస్ నేతల అనుచరులు కూడా రంగంలోకి దిగడంతో బుజ్జగింపులు కత్తి మీద సాములాగా మారాయంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు బుజ్జగించినా పెద్దగా ఫలితం ఇవ్వకపోవడంతో తలలు పట్టుకున్నారట.తమ నేతల మధ్య పోటీ ఎక్కడ విపక్షాలకు మేలు చేస్తుందోనన్న టెన్షన్ అధికార పార్టీ నేతల్లో కనిపిస్తోందట. పైకి మాత్రం ఎవరు గెలిచినా తమ పార్టీ వారే కదా అంటున్నప్పటికీ..ఇంటిపోరు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తాను బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కూడా నామినేషన్లు వేశారట.మొదటి దశ పోలింగ్ జరిగే మెజార్టీ పంచాయతీల్లో దాదాపుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వర్గీయులే బరిలో ఉన్నారట. రాజకీయంగా ప్రభావం చూపే సర్పంచ్ ఎన్నికల్లో మంత్రి అనుచరులు బరిలో నిలవడంతో నకిరేకల్ హస్తం రాజకీయం వేడెక్కుతోంది. మార్కెట్ కమిటీల నియామకం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం మధ్య గ్యాప్ పెరిగిందనే ప్రచారం బలంగా ఉంది. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే కావడంతో సీనియర్ నేతలు కూడా తమకు ఎందుకొచ్చిన లొల్లి అని మౌనంగా ఉంటున్నారట.మంత్రి అండ చూసుకొని కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే వేముల వీరేశం అసహనంగా ఉన్నారట. మంత్రి కూడా నో డిస్కషన్స్..మన మనుషులు బరిలో ఉండాల్సిందేనని పట్టుబట్టడంతో పలు చోట్ల పోటీ తప్పలేదని అంటున్నారు. అటు మంత్రి, ఇటు ఎమ్మెల్యే వ్యూహాలకు పదును పెడుతుండటంతో నకిరేకల్ కాంగ్రెస్ రాజకీయం వేడుక్కుతోంది. ఇక తుంగతుర్తి నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గీయులు, దివంగత నేత దామోదర్ రెడ్డి వర్గీయులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. నియోజకవర్గంలో బరిలో ఉన్నవారిలో ఎక్కువ మంది తమ పార్టీ వాళ్లేనని హస్తం పార్టీ నేతలే చెప్తున్నారు.కొత్త కాంగ్రెస్, పాత కాంగ్రెస్‌గా విడిపోయిన క్యాడర్..ఎవరికి వారు నామినేషన్లు వేశారు. నియోజకవర్గంలోని 90శాతం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సపోర్టర్సే బరిలో ఉన్నారుట. పలుచోట్ల ముగ్గురు కాంగ్రెస్ మద్ధతుదారులు పోటీలో ఉండటంతో క్యాడర్ తలలు పట్టుకుంటున్నారట. ఓవైపు ఎమ్మెల్యే వర్గం, మరోవైపు దామోదర్ రెడ్డి వర్గంగా విడిపోయి ఎవరికి వారు పోటీ చేస్తుండడంతో ఎవరికి ఎవరు నచ్చచెప్పాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందట.సూర్యాపేట నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి వర్గంగా విడిపోయి బరిలో నిలిచారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి చెందిన హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లోనూ పలుచోట్ల సొంత పార్టీ నేతలే పోటీ పడుతుండటం ఆశ్చర్యంగా మారింది. మొదటి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేస్తే..రాకరాక ఈ సారి అవకాశం వచ్చిందని..సమీకరణాల పేరుతో కొత్తవారికి టికెట్ ఇస్తున్నారంటూ పాత క్యాడర్ తీవ్ర ఆందోళనకు గురవుతోందట.మిర్యాలగూడలో కూడా పలు గ్రామాల్లో అధికార పార్టీ నేతల మధ్యే హోరాహోరీ పోరు కొనసాగుతోంది. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కాకపోవడం..ఎవరు గెలిచినా తమ పార్టీనే కదా అన్న ధీమాతో ఎమ్మెల్యేలు పలుచోట్ల పల్లె పాలిటిక్స్ జోలికి పోవడం లేదు. ఎవరు గెలిచినా పార్టీకి నష్టం లేదని ఎమ్మెల్యేలే అంటున్నారట. అయితే ముఖ్యనేతలను నమ్ముకొని పోటీ చేసి ఆర్థికంగా నష్టపోతే తమ పరిస్థితి ఏంటని అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారట.మరోవైపు అధికార పార్టీ అన్న తర్వాత ఆశావహులు ఎక్కువగా ఉంటారని కవర్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. ఇదే అదనుగా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో తమ మద్ధతుదారులను గెలిపించుకోవాలని బీఆర్ఎస్ ఉవ్విళ్లూరుతోంది. పలుచోట్ల వామపక్ష పార్టీలతో అవగాహన కుదుర్చుకుంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు గులాబీ లీడర్లు.

# బీఆర్ఎస్ ఎందుకంత సైలెంట్ ?




హైదరాబాద్, ప్రజాస్వరం :

పార్టీ పవర్‌లో లేదు. పైగా సిచ్యువేషన్స్ బాలేవు. పోనీ పట్టుబట్టి అభ్యర్థులను గెలిచిపించినా.. ఎన్నికయ్యాక వాళ్లు పార్టీలో ఉంటారో జంప్ అవుతారో తెలియదు. ఎందుకొచ్చిన టెన్షన్. లైట్ తీసుకుంటే పోలా అంటోందట బీఆర్ఎస్. అందుకే సర్పంచ్ ఎన్నికలపై గులాబీ పార్టీ సీరియస్‌గా ఫోకస్ పెట్టడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఓవైపు సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని జిల్లాల టూర్ చేస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కనీసం పట్టించుకోవడం కాదు కదా..ఓ సమీక్ష కూడా చేయకపోవడం చర్చకు దారితీస్తోంది.తెలంగాణలో పంచాయతీ ఎన్నికల రాజకీయం అంతకంతకు హీటెక్కుతోంది. నువ్వానేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. చాలా చోట్ల కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అయితే పంచాయతీ ఎన్నికల వేళ..జిల్లా టూర్‌లో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేస్తున్నారు. ప్రజాపాలన రెండేళ్ల సంబరాల పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్న రేవంత్..సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వరాల జల్లులు కురిపిస్తున్నారు. వెళ్లిన చోటల్లా పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారు ముఖ్యమంత్రి. సాధ్యమైనంత వరకు మెజారిటీ పంచాయతీలను గెలుచుకోవాలని దిశానిర్దేశం చేస్తున్నారు. ఇండైరెక్ట్‌గా పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చెబుతున్నారు. దీన్ని బట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకున్నారో అర్థం చేసుకోవచ్చు.ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ మాత్రం పంచాయతీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటమి తర్వాత ఇంకాస్త నిరాశ చెందిన గులాబీ పార్టీ ఇంకా దాని నుంచి బయటకు రాలేకపోతోందన్న చర్చ జరుగుతోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు అంటే ఎలాగూ అధికార పార్టీదే పైచేయి ఉంటుంది. పైగా పట్టుబట్టి అభ్యర్థులను పెట్టి గెలిపించినా వారు పార్టీలో ఉంటారో లేదోనన్న డైలమా ఉందట. అన్నింటికి మించి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ఫండిరగ్ చేయడం కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ఇప్పుడున్న పరిస్థితుల్లో భారంగా మారనుంది.ఈ అంశాన్నింటిని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఎన్నికలను లైట్ తీసుకుందట బీఆర్ఎస్. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉంటుంది కాబటి.. అప్పుడు ఎంతో కొంత ఫోకస్ చేయాలని భావిస్తోందట. మెయిన్‌గా అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పని చేసుకుంటూ పోవాలనేది బీఆర్ఎస్ కారు పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. 20 నుంచి 30 నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోవడం లేదని తెలంగాణ భవన్ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది. పార్టీ క్యాడర్ స్ట్రాంగ్‌గా ఉన్నచోట..ఎమ్మెల్యేలు అండదండలు ఉన్న దగ్గర..కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటున్నారట బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు. రాష్ట్ర పార్టీ మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదని..అంతర్గతంగా మాజీ మంత్రులు ఓసారి జిల్లాల వారీగా సమీక్ష చేశారని అంటున్నారు.పంచాయతీ ఎన్నికలను కారు పార్టీ లైట్ తీసుకోవడానికి ఎన్నో రీజన్స్ ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించుకున్నా ఆ తర్వాత వాళ్లను అధికార కాంగ్రెస్.. పార్టీలో చేర్చుకుంటుందని బీఆర్ఎస్ భావిస్తోందట. ఇప్పటికే చాలాచోట్ల బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలనుకున్న సర్పంచ్ అభ్యర్థులు..కాంగ్రెస్ నేతల ప్రలోభాలకు వెళ్లిపోయారని గులాబీ పార్టీ నేతలు వాపోతున్నారు. దీంతో కారు పార్టీ నుంచి పోటీ చేసేందుకు కొన్నిచోట్ల అభ్యర్థులు కూడా లేరన్న చర్చ జరుగుతోంది. ఒకవేళ తాము బలపరిచిన అభ్యర్థులు గెలిచినా..అభివృద్ధి పేరుతో హస్తం గూటికి చేరే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పుడున్న పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా స్థానిక ఎన్నికలపై పార్టీ చేతులు ఎత్తేస్తే రానున్న రోజుల్లో క్యాడర్ చేజారిపోయే ప్రమాదం ఉందని బీఆర్ఎస్‌లో అంతర్గత చర్చ జరుగుతోంది.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ.

**వనపర్తి,డిసెంబర్ 10 (ప్రజాస్వరం):** జిల్లా కేంద్రంలోని జంగిడిపురం కాలనీలో బుధవారం భక్తి సంప్రదాయాల నడుమ 18వ మహా అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. నారికేళ స్వామి వెంకటేష్‌యాదవ్ నిర్వహించిన మహా పడి పూజ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ హాజరై వెంకటేష్ స్వామిని సన్మానించారు.

గురుస్వాములు, అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు రాజ్ దేశపాండే, ముత్తు కృష్ణ, హరినారాయణ, నరేందర్, కృష్ణసాగర్‌ల కరకమలములచే పడి పూజ అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా గణపతి హోమం, అభిషేకాలు, అనంతరం అయిదుగురు నారికేళ గురుస్వాములు—వాకిటి శ్రీధర్, వెంకటేష్ యాదవ్, సుధాకర్, శ్రీనివాసులు, బాలకృష్ణ శెట్టి—లకు సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీని అనంతరం అష్టోత్తర మహా పడిపూజ పూర్తి విశిష్టతతో సాగింది. ఈ సందర్భంగా రాజ్ దేశపాండే, వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ—"18 సార్లు మాల ధరించి శబరిమల యాత్ర చేయడం పూర్వజన్మ సుకృతం. నియమ నిష్టలతో దీక్షను ఆచరించడంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వనపర్తిలో 18 పర్యాయాలు మాలవేసిన అయ్యప్పల సంఖ్య అధికంగా ఉండడం గర్వకారణం," అని పేర్కొన్నారు.అయ్యప్ప దీక్షలతో మానసిక ప్రశాంతత, భక్తి, సేవాభావం,ఐకమత్యం పెంపొందుతాయని వారు అన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు రఘుమా రెడ్డి,బీచుపల్లి యాదవ్, నరేందర్,అశోక్ రెడ్డి,గట్టు శశి, ప్రతాప్ రెడ్డి,అనిల్,బాలీశ్వరయ్య, నగేష్,గోపి,రాంనారాయణ,రాజు గురుస్వామి,వెంకటయ్య, రామకృష్ణ,నందిమల్ల అశోక్, అవుల రమేష్‌తో పాటు కాలనీ వాసులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# దక్షిణంలో హోరెత్తించిన సంతకాల సేకరణ ఉద్యమం..

- **మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను రద్దు చేయండి**
- **దక్షిణ వైసీపీ కార్యాలయం నుండి బారీగా బైక్ ర్యాలీ**
- **జిల్లా కార్యాలయానికి ప్రతులను చేరవేసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి.**

**విశాఖపట్నం,డిసెంబర్ 10(ప్రజాస్వరం):** ప్రభుత్వ పేదల వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను తక్షణమే నిలుపుదల చేయాలంటూ చేస్తున్న సంతకాల సేకరణ ఉద్యమం దక్షిణంలో హోరెత్తించింది. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం ముమ్మరంగా సాగింది. 14 వార్డులలో కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు సీనియర్ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సహకరించిన 60,000 సంతకాల ప్రతులను ఆశీలమెట్ట వైఎస్ఆర్సిపి కార్యాలయం నుండి వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి పనులు భూస్థాపితం చేయాలన్న చంద్రబాబు కుట్రతో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల వాటికి అనుబంధంగా ఉండే బోధన ఆసుపత్రులలో పేదలకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్యం అందదని చెప్పారు. ఇంకా రోగ నిర్ధరణ అలాగే ఇన్ పేషెంట్ మెడిసిన్స్ కి చార్జ్ చేస్తారని ఆరోపించారు. ఇదిలా ఉండగా మరో వైపు రాష్ట్రం పెద్ద సంఖ్యలో మెడికల్ సీట్లు కోల్పోతుందని తెలిపారు.

గత ఏడాది 750 ఎంబిబిఎస్ సీట్లు సమకూర్చాల్సి ఉన్న చంద్రబాబు ప్రభుత్వ కక్ష పూర్తి విధానాలతో 700 సీట్లు కోల్పోయామని పేర్కొన్నారు. 2025 26 లో 1750 సీట్లు, అలా మొత్తం 2450 మెడికల్ సీట్లు మన పిల్లలు కోల్పోతున్నారని తెలియజేశారు. 1947 నుంచి 2022 వరకు రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కాలేజ్ మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఒకేసారి 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం పి పిపి పేరిట డ్రామాలు ఆడుతోందని ప్రజలకు అర్థమైందని వివరించారు. వైయస్ జగన్ ప్రభుత్వం హయాంలోనూ 7 మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తికాగా అయిదు కాలేజీలో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి అని చెప్పారు. మరో 10 కాలేజీల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నట్లు వెల్లడించారు. వైయస్సార్సీపి ప్రభుత్వం దిగిపోయేసరికి వాటిలో దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన పనులు జరిగినట్లు పేర్కొన్నారు. కొత్త మెడికల్ కాలేజీల కోసం ఏటా రూ. 1000 కోట్ల చొప్పున అయిదు ఏళ్ళు వ్యయం చేస్తే చాలని, కానీ ప్రభుత్వం ఆ దిశలో ఆలోచన చేయకుండా, పి పి పి పేరుతో ప్రైవేటీకరణ పై ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలు కూడా పూర్తిచేసి అన్నిటిని ప్రభుత్వం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా అధ్యక్షులు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, దక్షిణ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అడ్డుకున్న తహసీల్దార్


**అల్లూరి జిల్లా గూడెం,డిశంబర్ 10(ప్రజాస్వరం):** మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి అనుమతి లేకుండా భూమిని చదును చేసి నిర్మాణాలు చేపడుతున్న ప్రయత్నాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 87/1 లో సుమారు ఐదు సెంట్ల వరకు భూమిని స్థానిక మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న విషయం తెలుసుకున్న తహశీల్దార్ హెచ్ అన్నజీరావు వీఆర్వోలను ఆక్రమిత స్థలం వద్దకు పంపి అక్కడ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా హెచ్చరిక బోర్డులను పెట్టించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామన్నారు. దీనిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే వారిపై భూ ఆక్రమణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ లకే బాలమజ్జి, వీఆర్వోలు లింగాలు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.




# వనపర్తిలో వెబ్ క్యాస్టింగ్‌తో మొదటి విడత పంచాయతీ పోలింగ్ పర్యవేక్షణ

- **జిల్లా కలెక్టర్ ఆదర్ష్ సురభి**

**వనపర్తి,డిసెంబర్ 10 (ప్రజాస్వరం):** వనపర్తి జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి, సాధారణ ఎన్నికల పరిశీలకులు మల్లయ్య బట్టు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్యతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం జరిగే తొలి విడత పోలింగ్‌ను కంట్రోల్ రూమ్ నుంచే ప్రత్యక్షంగా వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పోలింగ్ సిబ్బంది ఇప్పటికే పోలింగ్ సామగ్రిని స్వీకరించి ఆయా కేంద్రాలకు తరలిపోయారని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా సాగేందుకు అవసరమైన భద్రతా చర్యలు కూడా తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.



# బి ఆర్ఎస్ అభ్యర్థి జోరుగా ప్రచారం

**వలిగొండ,డిసెంబర్ 10(ప్రజాస్వరం):** గోపరాజు పల్లి గ్రామంలో టిఆర్ఎస్ అభ్యర్థి సర్పంచ్ నీలం నరేందర్ ముమ్మరంగా నిలకడలేని ప్రచారం కొనసాగిస్తున్నారు .ఉంగరం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ప్రతి గడప ప్రతి వాడా ఇంటింటికి ప్రచారం కొనసాగిస్తున్నారు. భారీ మెజారిటీతో గెలిపించాలని నేరం నరేందర్ గోపరాజు పల్లిగ్రామస్తులను వేడుకున్నారు. గ్రామాభివృద్ధి జరగాలంటే బి ఎస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. నన్ను గెలిపించండి ఎవరికి ఆపద వచ్చినా నేను మీకు అండగా ఉంటాను అన్నారు. జీవితం గ్రామ సేవకే పూర్తిగా సమర్పణ చేసి పనిచేస్తా. గ్రామ పరిశుభ్రతను స్థిరంగా నిర్వహించడం తాగునీటి సమస్యలు వీధిలైట్లు సమస్యలు రాకుండా చూస్తా అన్నారు .గ్రామ సమస్యలు నాకు తెలుసు కాబట్టి ప్రతి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తా అన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చదిద్దడానికి తనకు అవకాశం ఇవ్వాలని గ్రామ ప్రజలను వేడుకున్నారు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని మీరు అందరూ కలిసికట్టుగా ఐక్యతతో మీ ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో దీవించి గెలిపించి ఊరి సేవకై నన్ను వాడుకోవాలని గోపరాజు పల్లి గ్రామ ప్రజలను కోరారు.



# అత్యధిక మెజారిటీతో గెలిపించండి

- **బి ఆర్ఎస్ నాయకులు సంగిశెట్టి చంద్రయ్య**

**వలిగొండ,డిసెంబర్ 10(ప్రజాస్వరం):** వలిగొండ మండలం గోపరాజు పల్లి లో టిఆర్ఎస్ అభ్యర్థిని నీలం నరేందర్ ను గ్రామ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ నాయకులు సంగిశెట్టి చంద్రయ్య ప్రజలకు కోరారు.ఊరు మన బాధ్యత గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు ఊరు అభివృద్ధి కావాలంటే అది ఒక టిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. మన గ్రామ ప్రజలు మన నీలం నరేందర్ కు మీ ఆశీర్వాదం ఇవ్వండి. దీవించండి .ఒకసారి అవకాశం ఇవ్వండి ఊరి అభివృద్ధి ఏవిధంగా ఉంటుందో మీరే చూడండి ప్రజలను కోరారు .ఏదేమైనా ప్రజలంతా ఎక్కడ చూసినా ఏ గల్లి చూసిన అందరి నోటా నరేందర్ అనే మాట అని అన్నారు.పార్టీలో ఉన్న యువకులు నిరుద్యోగులు,రైతులు కార్యకర్తలు,ప్రతి ఒక్కరూ మీ ఓటుతో మిత్రపక్షాలకు బుద్ధి చెప్పి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు .గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు .ఓటు



వేసే ముందు ఆలోచించి గ్రామం ఎవరి వల్ల అభివృద్ధి జరుగుతుందో చూసి ఓటు వేయాలన్నారు.

# ప్రచారం లో దూసుకుపోతున్న అలవాల లింగయ్య

**ఖమ్మం,డిసెంబర్ 10 (ప్రజాస్వరం):** కూసుమంచి మండల పరిధిలోని నేలపట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గా బిఆర్ఎస్ మద్దతు తో పోటీ చేస్తున్న యువకుడు,విద్యావంతుడు,ఖమ్మం ఆర్జేసి కళాశాల ప్రిన్సిపాల్ అయిన అలవాల లింగయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.ఈనెల 14న జరగనున్న ఎన్నికల్లో తన గుర్తు అయిన ఉంగరం పై ఓటువేసి తనను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని కోరుతూ గ్రామంలోని వృద్ధులు,మహిళలు,యువతను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రచారం సందర్భంగా లింగయ్యకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు.మహిళలు ఎదురేగి హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారు.దీనిలో భాగంగా బుదవారం కూడా ఆయన ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా లింగయ్య మట్లాడుతూ రానున్న ఎన్నికలలో నేలపట్ల సర్పంచ్ గా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేస్తానన్నారు.పంచాయతీ కి రావాల్సిన నిధులను సాధించేందుకు కృషి చేస్తానని,తద్వారా గ్రామంలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.అదేవిధంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని అన్నారు .ఈ కార్యక్రమంలో దోమల వెంకులు, చెరుకుపల్లి నాగయ్య,జాల నాగయ్య,నీరుడు సంగయ్య, కొప్పుల గురవయ్య,వార్డ్ సభ్యులు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి'

**మాసాయిపేట డిసెంబర్11 (ప్రజాస్వరం)** మాసాయిపేట 44వ జాతీయ రహదారిపై ఎఫ్ఎస్ఈ (FST) బృందం చేపట్టిన తనిఖీలను జిల్లా గ్రామ పంచాయతీ వ్యయ పరిశీలకులు జుల్ఫికర్ అలీ పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. అనుమానిత ప్రాంతాలు, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతి ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు



# జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి:కలెక్టర్

**కాప్రా,డిసెంబర్ 10(ప్రజాస్వరం):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూసేకరణ, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయం లో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ పీడీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టుల పురోగతి, అవరోధాలను వివరించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రతి కేసును విడివిడిగా పరిశీలించి సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో కీసర ఆర్‌డిఓ ఉపేందర్ రెడ్డి,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999